క్లుప్తంగా

వైభవంగా ఎదుర్కోలు ఉత్సవం

మచిలీపట్నంటౌన్: గొడుగుపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి ఎదుర్కోలు ఉత్సవం వైభవంగా జరిగింది. గజవాహనంపై స్వామివారు, కల్పవృక్ష వాహనంపై అమ్మవారు ఆశీనులు కాగా గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం వైదిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆదివారం రాత్రి స్వామివార్ల దివ్య కల్యాణ మహోత్సవం జరుగుతుంది. ఆలయ ఈఓ కేవీ గోపాలరావు పర్యవేక్షించారు.

పెరటి కోళ్లతో ఉపాధి



పెడన: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు పెరటి కోళ్ల పెంపకంతో ఉపాధి పొందాలని ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద లబ్ధిదారులకు పెరటి కోళ్లను ఆమె అందజేసి మాట్లాడారు. పెడన మండలానికి 50 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. యూనిట్లను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీల గృహాలకు భూమి పూజ

టేకుపల్లి(మోపిదేవి): పేదలందరికీ ప్రభుత్వం జగనన్న లే అవుట్స్ ద్వారా పక్కా గృహాలు అందిస్తోందని, లబ్ధిదారులు సకాలంలో పూర్తిచేసి సొంతింటి కలను సాకారం చేసుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. టేకుపల్లి గ్రామం జగనన్న లే అవుట్స్‌లో ఎస్టీలకు కేటాయించిన స్థలంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శనివారం భూమి పూజ చేసి మాట్లాడారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ మండల ఏఈ రాజులపాటి తాండవ కృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

గూడూరు: రామన్నపేట–ఐదుగుళ్లపల్లి రోడ్డు నిర్మాణ పనులకు గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు శనివారం భూమి పూజ చేశారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ప్రత్యేక చొరవతో రోడ్డు నిర్మాణానికి జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేయించారు. రెండు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డును రూ.75 లక్షల వ్యయంతో నిర్మించనున్నారు. రామన్నపేట పీఏసీఎస్ చైర్మన్ మురాల వెంకటప్పయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, మోటేపల్లి రత్నారావు, సర్పంచి మురాల కవిత, ఐదుగుళ్లపల్లి ఎంపిటీసీ మారుతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆటల పోటీలు

బంటుమిల్లి: సమగ్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) బంటుమిల్లి ప్రాజెక్టు ఆధ్వర్యంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు శనివారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ నెల 8వ తేదీన జరగనున్న మహిళా దినోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహించామని సీడీపీఓ కె. సముద్రవేణి తెలిపారు. ఖో–ఖో, కబాడ్డీ, రన్నింగ్, స్పీడ్‌వాక్ తదితర ఆటల పోటీలు జరిగాయి. సూపర్‌వైజర్లు నాగలక్ష్మీ, నాగజ్యోతి పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

బంటుమిల్లి: మండల పరిధిలోని జీఎస్ సంఘాల అధ్యక్షులు, సిబ్బంది శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. మండల సమైఖ్య సంఘ కార్యాలయంలో నాలుగు రోజులుగా బిల్డింగ్ విజన్ ప్లాన్ (కల, గమ్యం) అనే అంశంపై డీఆర్‌పీలు శిక్షణ ఇచ్చారు. ఏపీఎం డి. శ్రీను, జీఎస్ సంఘ అధ్యక్షురాలు జి. లిల్లీకుమారి, పలు గ్రామాల అధ్యక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.

145 మందికి నేత్ర వైద్య పరీక్షలు

నాగాయలంక(అవనిగడ్డ): నాగాయలంక శ్రీపాద క్షేత్రం పుష్కరఘాట్ వద్ద సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తలశిల పూర్ణచంద్రరావు జ్ఞాపకార్థం తలశిల నాగేశ్వరరావు, మనువడు లలిత్ ఆర్థిక సహకారంతో నిర్వహించిన వైద్యశిబిరంలో పెదకాకాని శంకర నేత్రాలయ వైద్యులు డాక్టర్ నీరజ, రియా 145 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. 110 మందిని ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, గ్రంథాలయ అధికారి డి. రామకృష్ణ, తలశిల లీలామనోహర్, గరికపాటి శ్రీనివాసరావు, జి. సుధీర్, ఎస్. కృష్ణప్రసాద్ సహకారం అందించారు.

68 మందికి వైద్య సేవలు

మచిలీపట్నంటౌన్: ఈడేపల్లిలోని సత్యసాయి సేవా మందిరంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు సాయిప్రసాద్, ఆదిత్యమూర్తి, శివప్రసాద్ 68మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సత్యసాయి సేవాసమితి మచిలీపట్నం మెడికల్ ఇన్‌చార్జ్ పి. వరప్రసాద్, జిల్లా ఇన్‌చార్జ్ గోవర్ధనగిరిరావు, సత్యసాయిసేవా మందిరం కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ పాల్గొన్నారు.

ప్రణాళిక పదిలం

- మంచి ఫలితాలే లక్ష్యంగా టెన్త్ విద్యార్థుల చదువులు
- ప్రతిరోజు 8 గంటల పాటు నాలుగు సబ్జెక్టుల పఠనం
- కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు
- డీ గ్రేడ్ విద్యార్థుల దత్తత



బందరులో పాఠ్యాంశాలు చదువుతున్న విద్యార్థులు



గూడూరు హైస్కూలులో పునశ్చరణ తరగతుల్లో విద్యార్థినులు

మచిలీపట్నంటౌన్/గూడూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా మచిలీపట్నం నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు సబ్జెక్టుల రివిజన్‌లో నిమగ్నమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన విధంగా నూతన టైం టేబుల్ ప్రకారం విద్యార్థులు పాఠ్యాంశాలను రివిజన్ చేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ప్రతి రోజూ ఎనిమిది గంటల పాటు పాఠశాలల్లో సబ్జెక్టుల పఠనం జరిగేలా చూస్తున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 6 గంటల వరకు సబ్జెక్టుకు రెండు గంటల చొప్పున ఇచ్చిన టైం టేబుల్ ప్రకారం చదువుతున్నారు. ఈ నెల 9 నుంచి 17వ తేదీ వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు జరుగనున్నాయి. విద్యార్థులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో స్ఫూర్తి స్టడీమెటీరియల్‌ను పంపిణీ చేశారు. దీంతో పాటు పలు పాఠశాలల్లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో మూడు మోడల్ పేపర్లతో తయారు చేసిన బుక్‌లను పంపిణీ చేశారు. ఈ పుస్తకాలను విద్యార్థులు చదువుతున్నారు.

పరీక్షలకు 3355 మంది ..

ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మచిలీపట్నం నియోజకవర్గం నియోజకవర్గం, గూడూరు మండలం నుంచి మొత్తం 3,355 మంది హాజరుకానున్నారు. బందరు లోని 20 పాఠశాలల నుంచి 2,973 మంది విద్యార్థులు, గూడూరు మండలం నుంచి 382 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో మూడు ఎయిడెడ్, ఏడు నగర పాలక సంస్థ, రెండు ప్రభుత్వ, ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పరీక్షలకు రాయనున్నారు. గూడూరు మండలం మల్లవోలు హైస్కూల్ నుంచి ఈ ఏడాది అత్యధికంగా 145 మంది, గూడూరు నుంచి 71 మంది, కప్పలదొడ్డి నుంచి 68 మంది, కంకటావ నుంచి 37 మంది, తరకటూరు నుంచి 35 మంది, రాయవరం నుంచి 19 మంది, ముక్కొల్లు నుంచి ఏడుగురు విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతారు. గూడూరు, మల్లవోలు, కంకటావ ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

ఏ, బీ, సీ, డీ గ్రేడులుగా విద్యార్థులు

పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులను వారి ప్రతిభను బట్టి ఎ, బి, సి, డి లుగా విభజించారు. డి కేటగిరీలో ఉన్న విద్యార్థులను ఆ పాఠశాలలోని ఉపాధ్యాయులు దత్తత తీసుకుని చదివించనున్నారు. వారు కూడా మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా తర్ఫీదు ఇచ్చేందుకు శ్రద్ధ తీసుకుంటున్నారు.

మంచి మార్కులే లక్ష్యం



పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలనే లక్ష్యంతో చదువుతున్నాను. తెల్లవారుజాము నుంచే పాఠ్యాంశాలను చదవడం ప్రారంభిస్తున్నాను. సందేహాలు వస్తే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటున్నాను. మంచి మార్కులు సాధిస్తా.

– జాహ్నవి, విద్యార్థిని

ప్రభుత్వ ప్రణాళిక బాగుంది



రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నూతన టైం టేబుల్ ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఒక్కో సబ్జెక్టుకు రెండు గంటలు చొప్పున ప్రతి రోజూ నాలుగు సబ్జెక్టులను రివిజన్ చేస్తున్నాను. స్ఫూర్తి స్టడీమెటీరియల్ రివిజన్‌కు ఎంతగానో ఉపయోగపడుతోంది.

– పీడీపీవీ నాగులు, విద్యార్థి

రివిజన్ టెస్టులతో లోపాల గుర్తింపు



ప్రతి రోజూ నిర్వహిస్తున్న రివిజన్ టెస్టులతో పరీక్షల్లో మేము చేసే లోపాలను గుర్తించి వాటిని ఎలా సరిదిద్దుకోవాలో వివరిస్తున్నారు. దీంతో పొరపాట్లను సరిదిద్దుకోవడానికి మాకు అవకాశం కలుగుతుంది. పబ్లిక్ పరీక్షల్లో మార్కులు నష్టపోకుండా మంచి మార్కులు సాధించేందుకు ఉపయోగపడుతుంది.

– బత్తిన యశ్వంత్ సాయి, గూడూరు హైస్కూల్ విద్యార్థి

వాట్సాప్ గ్రూపుతో పర్యవేక్షణ



పదో తరగతి విద్యార్థుల చదువును పర్యవేక్షించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. విద్యార్థులు, ఉపాధ్యాయులతో వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశాం. విద్యార్థులు ప్రతిరోజు ఉదయం 5 గంటలకే నిద్రలేచి గ్రూపులో గుడ్‌మార్నింగ్ పెట్టాలి. అనంతరం ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి విద్యార్థులు చదువుతున్నదీ, లేనిదీ ఆరా తీస్తారు. ఆ తరువాత స్కూల్‌లో ప్రత్యేక తరగతులు, సాధారణ తరగతులకు హాజరవుతారు.

– టీవీ రఘుకాంత్, హెచ్‌ఎం, బందరుకోట మునిసిపల్ హైస్కూల్

లైన్‌మెన్ల సేవలు వెలకట్టలేనివి

ఎమ్మెల్యే పేర్ని నాని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: విద్యుత్ శాఖలో లైన్‌మెన్ల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. శనివారం స్థానిక పోర్టురోడ్డులోని మెహర్‌బాబా ఆడిటోరియంలో ఎలక్ట్రికల్ మచిలీపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మన్నెం భాస్కరరావు అధ్యక్షతన లైన్‌మెన్ దివస్ నిర్వహించారు. ఎమ్మెల్యే పేర్ని నాని మాట్లాడుతూ ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో లైన్‌మెన్లు చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. 24 గంటలు విధి నిర్వహణలో ఉండే లైన్‌మెన్లు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. డివిజన్‌లోని 120 మంది జూనియర్ లైన్‌మెన్లకు డిజిటల్ టెస్టర్లను కొనుగోలు చేసేందుకుగానూ పేర్ని నాని రూ. 60 వేల సొంత నిధులను వారికి అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన లైన్‌మెన్లకు నాని చేతుల మీదుగా అవార్డులను బహుకరించారు. సిబ్బందితో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భాస్కరరావు ప్రతిజ్ఞ చేయించారు. డివిజన్‌లోని ఏడీలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ పాలనలో మా కుటుంబాలు బాగుపడ్డాయి

పేర్ని కిట్టు వద్ద బందరుకోట మహిళల ఆనందం



తనకు కలిగిన మేలులను పేర్ని కిట్టుకు వివరిస్తున్న మహిళ

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మా కుటుంబాలు బాగుపడ్డాయని బందరుకోట మహిళలు పలువురు వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)కు వివరించారు. 21వ డివిజన్ బందరుకోటలో పేర్ని కిట్టు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు మాట్లాడుతూ అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, విద్యా కానుక, చేయూత, డ్వాక్రా సున్నావడ్డీ తదితర పథకాలతో తమ కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కలిగిందని చెప్పారు. కార్పొరేటర్ మన్నే శారద, డివిజన్ ఇన్‌చార్జి మన్నే శేషారావు, కార్పొరేటర్ రామిశెట్టి వాణిశ్రీ, వైఎస్సార్ సీపీ నాయకులు పురంశెట్టి శ్రీనివాసరావు, సుంకర రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

వాక్సిన్లను ఐస్‌ప్యాక్స్‌లో భద్రపరచాలి

డీఐఓ డాక్టర్ షర్మిష్ట

పెడన: చిన్నారులకు ఇచ్చే వ్యాక్సిన్ల విషయంలో ఏమరుపాటు తగదని, వాటిని ఐస్‌ప్యాక్స్‌లో భద్రంగా ఉంచాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ ఎస్. షర్మిష్ట అన్నారు. శనివారం ఆమె పెడన పీహెచ్‌సీ, పీహెచ్‌సీ పరిధిలో వ్యాక్సినేషన్ వేస్తున్న పలు సబ్ సెంటర్లను పరిశీలించారు. తొలుత ఆమె పీహెచ్‌సీలో వైద్యాధికారులు డాక్టర్ పర్వేజ్ హైదర్, డాక్టర్ మీనాదేవిలతో మాట్లాడారు. వ్యాక్సిన్ ఎలా వేస్తున్నది, ఎంతమంది ఏఎన్‌ఎంలు వ్యాక్సిన్ తీసుకువెళ్లారు అనే విషయాలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె బల్లిపర్రు సబ్ సెంటర్‌ను, గూడూరు మండలం ఆకులమన్నాడు పాలెం సబ్ సెంటర్లను పరిశీలించారు. వ్యాక్సిన్ ఐస్‌ప్యాక్‌లలో అజాగ్రత్తగా పెట్టడాన్ని పరిశీలించిన డీఐఓ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగిస్తే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీహెచ్‌ఓలు వీరయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మౌలాలి మృతికి సంతాపం

మచిలీపట్నంటౌన్: 22వ డివిజన్‌కు చెందిన గృహ సారథి ఎస్‌కే మౌలాలి శనివారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), కార్పొరేటర్ ఏకశిరి వెంకటేశ్వరరావు సందర్శించి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు బూరగ రామారావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


8న మహిళా దినోత్సవ ఆఫర్

మచిలీపట్నంటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీన సర్కారుతోటలోని స్విమ్మింగ్‌పూల్, జిమ్‌ను మహిళలు ఉచితంగా వినియోగించుకోవచ్చని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ కె. ఝాన్సీలక్ష్మీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఈ అకవాశం కల్పించామన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కృత్తివెన్ను శివాలయం హుండీ ఆదాయం రూ. 6.92 లక్షలు

కృత్తివెన్ను: కృత్తివెన్ను పంచాయతీ గుడిదిబ్బ గ్రామంలోని దుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానం హుండీ కానుకలను లెక్కించగా రూ. 6,92,719 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఫిబ్రవరి 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగిన మహా శివరాత్రి ఉత్సవాల తరువాత శనివారం హుండీని తెరవడంతో పాటు ఉత్సవాల సమయంలో అంతరాలయ దర్శనం, సైకిల్ పార్కింగ్, దుకాణాల సముదాయం, తలనీలాలు, అభిషేకాలు తదితర మార్గాల ద్వారా స్వామివారికి వచ్చిన ఆదాయాన్ని లెక్కించామని ఈవో చెప్పారు. ఆలయ చైర్మన్ పట్టపు నాగేశ్వరరావు, దేవదాయశాఖ ప్రత్యేకాధికారి యు. సుధాకర్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడు మృతి



బంటుమిల్లి: మల్లేశ్వరం గ్రామానికి చెందిన వృద్ధుడు గూడపాటి వెంకటేశ్వరరావు (105) శనివారం మృతిచెందాడు. వెంకటేశ్వరరావు మండలంలో దళిత నాయకుడిగా గుర్తింపు పొందాడు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన పాదయాత్ర ఆయనను అమితంగా ఆకర్షించి వీరాభిమానిగా మారాడు. ఎప్పుడూ మూడు రంగుల కండువా భుజాన వేసుకుని పార్టీపై అభిమానాన్ని చాటుకునేవాడు. వెంకటేశ్వరరావు మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

బందరులో 'మనం-మన గ్రంథాలయం'

మచిలీపట్నంటౌన్: నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయం, జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం మనం–మన గ్రంథాలయం కార్యక్రమం జరిగింది. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్, ఉద్యోగులు, సిబ్బంది గ్రంథాలయం, కార్యాలయాన్ని శుభ్రం చేశారు. రవికుమార్ మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. గ్రంథాలయ సంస్థ కార్యాలయ, జిల్లా గ్రంథాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

కృత్తివెన్ను: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ గణేష్‌కుమార్ అన్నారు. ప్రయాణంలో భద్రతా ప్రమాణాల గురించి ఆయన వాహనచోదకులకు శనివారం కృత్తివెన్నులో అవగాహన కల్పించారు. వాహన చోదకులు మితిమీరిన వేగంతో ప్రయాణించడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

రేపటి నుంచి సైన్స్ ఫెయిర్

కోడూరు: స్థానిక లక్ష్యా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో యూరేకా–2023 అనే అంశంలో ఈ నెల 6, 7 తేదీల్లో సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తామని స్కూల్ చైర్మన్ విస్సంశెట్టి శివనాగరాజు శనివారం తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించే సైన్స్ ఫెయిర్‌లో 250కు పైగా అంశాల్లో విద్యార్థులు ప్రదర్శనలు ఇస్తారని చెప్పారు. అన్ని పాఠశాలల విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌ను తిలకించేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు.

పింఛన్ అందజేత

మచిలీపట్నంటౌన్: 44వ డివిజన్‌లో పెరాలసిస్ స్ట్రోక్‌తో ఇబ్బంది పడుతున్న షేక్ లతీఫ్‌కు మంజూరైన రూ. 5 వేల పింఛను మొత్తాన్ని శనివారం అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) లతీఫ్‌ను పరామర్శించి ఈ మొత్తాన్ని డివిజన్ వలంటీర్, గృహ సారథి చేతుల మీదుగా పంపిణీ చేశారు. డివిజన్ ఇన్‌చార్జ్ మామిడిబత్తుల అజయ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం మేలు

పెడన: ప్రకృతి సేద్యం మంచిదని నందమూరు పీఏసీఎస్ అధ్యక్షుడు టీబీవీ ఉమామహేశ్వరరావు అన్నారు. ఎటువంటి రసాయనాలు వినియోగించని వరి ప్రజలను ఆరోగ్యవంతులుగా ఉంచుతుందని చెప్పారు. శనివారం అచ్చయ్యవారిపాలెం పంచాయతీ గొడపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ శాఖ మచిలీపట్నం సబ్ డివిజినల్ యాంకర్ స్వామిబాబు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉమామహేశ్వరరావు ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతంగా ఉంటుందని, తద్వారా పంట దిగుబడులు అధికంగా ఉంటాయని వివరించారు. అనంతరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ సత్యనారాయణ, స్కూల్ హెచ్‌ఎం వేణు, వీఏఏ వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తోంది

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



వ్యవసాయ కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

మోపిదేవి: భారతదేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. పెదకళ్లేపల్లి శివారు అయోధ్య, మేళ్లమర్రు, అర్జావారిపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. అర్జావారిపాలెంలో చందన ఏసుబాబూరావు ఇంటి బిల్లు బడే సంపూర్ణ అక్కౌంట్‌లో రూ. 70 వేలు పడినట్లు ప్రస్తుతం సంపూర్ణ మృతి చెందడంతో మీ సేవా కేంద్రం వారు ఇచ్చిన ఎకౌంట్ నెంబర్ మార్పించి ఆ నగదు మాకు ఇప్పించాలని బాధితులు కోరారు. రెండో బిల్లు మాత్రం లబ్ధిదారులైన ఏసు బాబూరావు అకౌంట్‌లోనే బిల్లు రూ. 26 వేలు పడ్డాయని వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సింహాద్రి అకౌంట్ నెంబర్ మార్పించి లబ్ధిదారులకు నగదు ఇప్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

అయోధ్య గుండంలో తాగునీరు, రహదారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ దేశం మొత్తం హర్షించేలా జగనన్న పాలన సాగుతోందన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు అనూహ్య స్పందన వచ్చిందని తెలిపారు. పేద ప్రజలు, ఆర్థిక సంపన్నులు కూడా జగనన్నను గుర్తించారని, జగనన్న ఆలోచనా విధానం కొనసాగించేందుకు ఆయనను మరోసారి ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పండలనేని అన్నపూర్ణ, సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు, గ్రామ కన్వీనర్ గండు దుర్గారావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఎంపీడీఓ నాగరేవతి



డ్రెయినేజీ సమస్యపై ఏఈని ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ సత్యనారాయణ

కోడూరు: వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని ఎంపీడీఓ నాగరేవతి తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిటీసీల ప్రశ్నలు, అధికారుల జవాబుల మధ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. వేసవిలో మండలంలోని హంసలదీవి, రామకృష్ణాపురం పంచాయతీల్లో తాగునీటి సమస్య అధికంగా ఉంటుందని, దీనిని నివారించేందుకు గ్రామాల్లోని రక్షిత మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నీటిలో నింపామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యసాయి ప్రకాష్ తెలిపారు. ఈ నెలాఖరు వరకు కాలువలకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేస్తారని, అన్ని పంచాయతీల్లోని చెరువులను నింపుకోవాలని సూచించారు. వి.కొత్తపాలెం వద్ద రూ.12 లక్షలతో పైపులైన్ రిపేర్లకు అనుమతులు మంజూరయ్యాయని ఏఈ తెలిపారు. మండలంలోని 25 మురుగు డ్రెయిన్‌ల ప్రక్షాళనకు ప్రభుత్వానికి నివేదిక పంపామని డ్రెయినేజీ ఏఈ హరీష్ తెలిపారు. గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు, స్తంభాలను ఆ శాఖాధికారులు వివరించారు. తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, ఉపాధి పనులకు సంబంధించిన అంశాలపై ఎంపీటీసీలు, సర్పంచులు అధికారులను ప్రశ్నించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, వైస్ ఎంపీపీలు చేబోయిన లీలావతి, ముక్కు వెంకటేశ్వరరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చల్లపల్లికి నూతన శోభ



నూతనంగా నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లు



అభివృద్ధి చేసిన మహాత్మాగాంధీ స్మృతివనం

- రూ.6 లక్షలతో గాంధీ స్మృతివనం అభివృద్ధి
- రూ.12 లక్షలతో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం
- నేడు ప్రారంభోత్సవం

చల్లపల్లి: గ్రామ పరిశుభ్రత, సుందరీకరణకు కృషి చేస్తున్న స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తల ఆధ్వర్యంలో చల్లపల్లిలో మరో రెండు అభివృద్ధి కార్యక్రమాలు సాకారమయ్యాయి. స్వచ్ఛ చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ డీఆర్కే ప్రసాద్, సుందర చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ తరిగోపుల పద్మావతి ఆర్థిక సహకారంతో చల్లపల్లి గ్రామ సచివాలయం –1 ప్రాంగణంలో రూ. 12 లక్షలతో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించారు. వీటిని ఆదివారం ఉదయం ప్రారంభించనున్నారు. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న మహాత్మా గాంధీ స్మృతివనాన్ని డీఆర్కే దంపతులు రూ.6 లక్షలతో అభివృద్ధి చేశారు. గాంధీ విగ్రహం చుట్టూ గ్రానైట్‌తో ఆకర్షణీయంగా మార్చారు. డ్రెయినేజీపై తూములతో కల్వర్టు నిర్మించి, ప్రాంగణం మొత్తం పేవర్ టైల్స్ ప్లాట్‌ఫాం నిర్మించారు. లాన్, గార్డెన్ పూర్తి స్థాయిలో పునరుద్ధరించారు. తద్వారా మహాత్మాగాంధీ స్మృతివనం నూతన శోభ సంతరించుకుంది. ఈ ప్రాంగణాన్ని ఆదివారం ఉదయం కార్యకర్తలు ర్యాలీగా చేరుకుని ప్రారంభిస్తారు.

అభివృద్ధిలో భాగస్వాములయ్యారు



స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం ద్వారా చల్లపల్లిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. రైతుబజారు, సంతబజారు ఎదుట పేవర్ టైల్స్ ప్లాట్‌ఫాం నిర్మించారు. బహిరంగ మల విసర్జనతో దుర్గంధభరితంగా ఉన్న గ్రామ శివార్లను కార్యకర్తలు స్వయంగా శుభ్రం చేస్తూ ప్రజల్లో క్రమంగా మార్పు తెచ్చారు.

– పైడిపాముల కృష్ణకుమారి, సర్పంచ్

ప్రజల భాగస్వామ్యం పెరగాలి



స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం ద్వారా స్ఫూర్తి పొంది ఎంతో మంది కలిసి పనిచేస్తున్నారు. ప్రజల భాగస్వామ్యం కూడా తోడవ్వాలి. సింగిల్ యూజ్‌డ్ ప్లాస్టిక్ వినియోగం స్వచ్ఛందంగా విడనాడాలి. పర్యావరణ పరిరక్షణ, గ్రామ పరిశుభ్రతలో ప్రజలు తమ వంతు పాత్ర పోషించాలి.

– డాక్టర్ డీఆర్కే ప్రసాద్, కన్వీనర్

రూ.14.11 లక్షలకు ఆశీల వసూళ్ల వేలం

పెడన: పట్టణంలోని పండ్లు, పూలు, కూరగాయల మార్కెట్, మత్స్యమాంసాదుల మార్కెట్, వారపు సంతకు సంబంధించి ఆశీలు వసూలు చేసుకునేందుకు నిర్వహించిన బహిరంగ వేలం పాట రూ.14.11 లక్షలకు పాడుకున్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో వేలం నిర్వహించగా ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. రూ.14 లక్షలకు ఖరారు చేసి పాట నిర్వహించారు. వచ్చిన ఇద్దరు కూడా సిండికేట్ కావడంతో రూ.14,11,000లకు మాత్రమే రౌతుల ప్రసాద్ దక్కించుకున్నారు. ఇదే వ్యక్తి గత ఏడాది రూ.22.50 లక్షలకు పాడుకోవడం విశేషం. రూ.14.11లక్షలకు పాడుకోగా జీఎస్టీ, స్వీపింగ్ చార్జెస్ వంటి వాటితో కలిపి పాటదారుడు రూ.17,64,980 కట్టాల్సి ఉంటుందని మున్సిపల్ కమిషనర్ అంజయ్య తెలిపారు.